అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
1
గురువారం 27 ఏప్రిల్ 2023

నిత్యావసర సరుకులు అందజేత

నవతెలంగాణ - పెంచికల్‌పేట్

అగర్‌గూడ గ్రామానికి చెందిన రాంటెంకి గణపతి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఎస్ఐ విజయ్ బుధవారం అతని కుటుంబానికి 25కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు, పండ్లు గ్రామ సర్పంచ్ పాలె సుధాకర్‌తో కలిసి అందజేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది హరీష్, గ్రామస్తులు ఆశన్న, బ్రహ్మయ్య పాల్గొన్నారు.



కంటి వెలుగు ప్రారంభం

నవతెలంగాణ - వాంకిడి

మండలంలోని కమాన గ్రామంలో రెండో విడత కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ పెందూర్ పవన్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని గ్రామ పంచాయతీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కంటి లోపం కలిగిన వారికి కంటి చూపు మెరుగుపరచడానికి కంటి అద్దాలు ఇస్తారని తెలిపారు. కంటి చూపు లోపం ఎక్కువగా ఉన్న వారికి ఉచితంగా కంటి ఆపరేషన్ చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రవీన్, పంచాయతీ కార్యదర్శి పోశం, సింగిల్ విండో మెంబర్ గొల్ల, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రకృతి ప్రకోపం..అన్నదాతకు శోకం..!



కాగజ్‌నగర్ : దెబ్బతిన్న వరి పంట

- అకాల వర్షాలతో పచ్చని పంటలు ఆగమాగం
- కొనుగోలు కేంద్రాలు లేక..పంటను అమ్ముకోలేక
- దయనీయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న కర్షకులు
- పంట నష్టం అంచనా వేస్తున్న అధికారులు

ప్రకృతి ప్రకోపానికి అన్నదాతలు బలవుతున్నారు. ఎండాకాలంలో కూడా అకాల వర్షాలు కురవడం కర్షకులను కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. చేతికొచ్చే సమయంలో పంటలన్ని నేలరాలగా.. ఇంటికొచ్చిన పంటను కాపాడుకోలేక దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు. కల్లాలు, ఇంటి ఆవరణలో ఆరబెట్టిన మొక్కజొన్న, జొన్న రాశులను ఈ వడగండ్ల వర్షం బారి నుంచి కాపాడుకోవడానికి అనుక్షణం అప్రమత్తంగా ఉంటున్నారు. ఉదయం, రాత్రి తేడా లేకుండా చిన్నపాటి గాలి వీచినా పొలాలకు పరుగులు తీస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయకపోవడంతో ప్రయివేటులో తక్కువ ధరకు విక్రయించడం లేదు. ఇక కోత దశకు వచ్చిన మొక్కజొన్న, జొన్న, మామిడి పంటలు ఈదురుగాలులు, రాళ్ల వర్షం తాకిడికి తట్టుకోలేక నేలరాలి కర్షకులకు కన్నీళ్లు మిగిల్చింది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, తలమడుగు

అకాల వర్షాలు ఉమ్మడి జిల్లాకు భారీ నష్టాన్ని మిగిల్చాయి. ఒక్కో ప్రాంతంలో ఒక్కో పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. నిర్మల్ ప్రాంతంలో కడెం, దిలావర్‌పూర్, లక్ష్మణచాంద, ఖానాపూర్, భైంసా తదితర వాటిలో వరి పంట వంగిపోయి వడ్లు రాలిపోగా..తానూర్‌లో రాళ్ల వర్షం కురిసి ఆస్తి నష్టం సంభవించింది. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు, ఇచ్చోడ, నేరడిగొండ, బోథ్, బజార్‌హత్నూర్ తదితర మండలాల్లో మొక్కజొన్న, జొన్న పంటలు దెబ్బతిన్నాయి. తలమడుగు మండలం నందిగామలో రాళ్ల వర్షం కురవడంతో జనం భయభ్రాంతులకు గురయ్యారు. సుంకిడిలో పిడుగుపాటుకు ఓ ఎద్దు మృతిచెందింది. తొమ్మిది మండలాల్లో ఈ వర్షం ప్రభావం చూపించింది. క్షేత్రస్థాయిలో పర్యటించిన వ్యవసాయశాఖ అధికారులు సుమారు 2వేల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అంచనా వేశారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ నియోజకవర్గంలోని ఏడు మండలాల్లోనూ అకాల వర్షం నష్టాన్ని మిగిల్చింది. ఇక్కడ ప్రధానంగా వరి పంట వంగిపోయి వడ్లు రాలిపోవడంతో అన్నదాతలకు ఆవేదనను మిగిల్చింది. మంచిర్యాల జిల్లాలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

క్షేత్రస్థాయిలో పరిశీలన..!

ఉమ్మడి జిల్లాలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండలు మండుతుండగా తదనంతరం వాతావరణం అనూహ్యంగా మారిపోతోంది. సాయంత్రం సమయంలో గాలివీయడం..ఆ వెంటనే ఆకస్మాత్తుగా వర్షం వస్తుండటంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా అనేక చోట్ల జొన్న, మొక్కజొన్న పంటలు ఇంటికొచ్చాయి. కానీ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయలేదు. దీంతో పంటలను తక్కువ ధరకు ప్రయివేటు వ్యాపారులకు విక్రయించలేక పొలాలు, ఇంటి ఆవరణలో నిల్వ చేసుకున్నారు. టార్పాలిన్ల సాయంతో వర్షం నుంచి రక్షణ కల్పిస్తున్నా.. భూమిపై నుంచి నీళ్లు పారడంతో నేలంతా తడిగా మారి పంట కూడా తడిసిపోతోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం ఆయా చోట్ల పంట నష్టం అంచనా వేస్తోంది. కడెం మండలంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డి పర్యటించి నష్టం వివరాలను తెలుసుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలో జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య తన బృందంతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదిక రూపొందిస్తున్నారు.

ఇంకా జాడలేని పరిహారం..!

వడగండ్ల వర్షాలు ఉమ్మడి జిల్లాను వీడటం లేదు. ఈ ఏడాది మార్చిలో కురిసిన భారీ వర్షాలకు యాసంగి పంటలైన జొన్న, మొక్కజొన్న, నువ్వులు, ధనియాలు, కూరగాయల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఆ సమయంలో ఉమ్మడి జిల్లాలో వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు. ఈ నివేదికను ప్రభుత్వానికి పంపించారు. ఇలా పంట నష్టపోయిన అన్నదాతలకు ఎకరానికి రూ.10వేల చొప్పున నష్ట పరిహారం అందజేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. నెల రోజులు గడుస్తున్నా ఈ పరిహారం జాడలేకుండా పోయింది. ఎప్పటిలోగా పంపిణీ చేస్తారో అధికారులకు కూడా తెలియని పరిస్థితి నెలకొంది. తాజా వర్షాలతో మరింత నష్టం జరగడంతో కర్షకులు దయనీయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

కండ్ల ముందే నేలపాలైంది : జగన్మోహన్‌రెడ్డి, భరంపూర్, తలమడుగు



నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న పంట వేశాను. రాత్రింబవళ్లు కష్టపడి పండించిన ఈ పంట కోతకు వచ్చే దశలో వడగండ్ల వర్షానికి నేలరాలిపోయింది. కండ్ల ముందే పంటంతా కిందపడిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలి.



తలమడుగు : దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న జడ్పీటీసీ, వ్యవసాయాధికారులు



తలమడుగు : కొత్తనందిగామలో లేచిపోయిన ఇంటి పైకప్పు రేకులు

రోడ్డు ఊడుస్తూ వీఓఏల నిరసన

నవతెలంగాణ - వాంకిడి

మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో వీఓఏలు చేపట్టిన సమ్మె 10వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా బుధవారం వీఓఏలు రోడ్డు ఊడుస్తూ నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆనంద్, సంతోష్, మోహన్, స్వాతి, పద్మ, రాజేశ్వరి పాల్గొన్నారు.



భీమిని : వీఓఏల నిరవధిక సమ్మెకు బీజేపీ మండల అధ్యక్షులు కొంక సత్యనారాయణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 ఏళ్లుగా పని చేస్తున్న వీఓఏలతో ప్రభుత్వం వెట్టి చాకిరి చేయించుకుంటోందని మండిపడ్డారు. వెంటనే వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిజెపి మండల ఇంచార్జి రేవెల్లి రాజలింగు, జిల్లా కార్యవర్గ సభ్యులు సబ్బని రాజనర్సు, పొట్లపల్లి సత్యనారాయణ, శేఖర్, ఇప్పకాయల వెంకటేష్, కోట విజయ్, బత్తిని రమేష్‌గౌడ్, పోతురాజుల శంకర్ పాల్గొన్నారు.

ఉపరితల గనిని సందర్శించిన డైరెక్టర్



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఉపరితల గనిని డైరెక్టర్(ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డితో కలిసి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఉపరితల గని ప్లాన్లను పరిశీలించి, ఈ ఆర్థిక సంవత్సర రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, బొగ్గు రవాణా చేయాలని సూచించారు. 2023-24 ఆర్థిక సంవత్సర ఉత్పత్తి లక్ష్యాలను వీలైనంత తొందరగా సాధించడానికి తగిన ప్రణాళికలు వేసుకొని ముందుకు వెళ్లాలని సంబంధిత అధికారులకు సూచించారు. క్వారీలోని పని ప్రదేశాలను పరిశీలించి రక్షణతో కూడా ఉత్పత్తి ఉత్పాదకత సాధించడానికి ఉద్యోగులందరూ వ్యక్తిగత రక్షణ పరికరాలు ధరించాలని తెలిపారు. ఓబి కాంట్రాక్ట కంపెనీ గౌరవ్, సిఆర్ఆర్ కంపెనీ ప్రతినిధులతో తమ రోజువారి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని, ఆర్థిక సంవత్సర లక్ష్యాలను సాధించడానికి తగిన ప్రణాళికలు వేసుకోవాలని సూచించారు. రాబోవు వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని వర్షపు నీరు క్వారీలో నిలవకుండా ఉండడానికి అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, బొగ్గు రవాణాకు ఇబ్బంది లేకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ వి పురుషోత్తమరెడ్డి, ఇంచార్జ్ గని మేనేజర్ శ్రీనివాస్, ప్రాజెక్ట్ ఇంజనీర్ చంద్రశేఖర్, సర్వే అధికారి సంపత్, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్ పాల్గొన్నారు.

రెండో విడత గొర్రెల పంపిణీపై అవగాహన



నవతెలంగాణ-దండేపల్లి

రెండో విడత గొర్రెల పంపిణీ దరఖాస్తుల స్వీకరణపై గొర్రెల మేకల పెంపకదారుల సంఘాలకు జిల్లా పశువైద్యాధికారి డా.రమేష్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండో విడతలో అర్హులైన లబ్దిదారులు తొందరగా డిడిలు కట్టవలసిందిగా సూచించారు. డిడిలతో పాటు కుల ధ్రువీకరణ పత్రం కూడా అందజేయాల్సి ఉంటుందని సూచించారు. యూనిట్ ధర రూ.1.75లక్షలు కాగా రూ.43750 డిడిలు చెల్లించవలసి ఉంటుందని, వారంలోపు ఈ ప్రక్రియను ముగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ డాక్టర్ ధనరాజ్, మండలంలోని గొర్లు, మేకల పెంపకదారుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



కాసిపేట : అకాల వర్షంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ దిలీప్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు వరి, మొక్క జొన్న, మామిడి పంటను రైతులు నష్టపోయారన్నారు. ఈదురుగాలులకు గుడిసెలు ధ్వంసమయ్యాయని తెలిపారు. ప్రభుత్వం నష్టపోయిన గుర్తించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల ఇన్‌చార్జి అట్కపురం రమేష్, మండల ప్రధాన కార్యదర్శి సూరం సంపత్, మండల ఉపాధ్యక్షుడు పోలవేని పోశం, బీసీ మోర్చా మండల అధ్యక్షులు పెద్దపెల్లి శంకర్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు దుర్గం దుర్గయ్య పాల్గొన్నారు.

లక్షెట్టిపేటలో మళ్లీ దొంగ నోట్లు ప్రత్యక్షం

- అమాయక మధ్య తరగతి ప్రజలే టార్గెట్
- మార్కెట్, చిరు వ్యాపారులే లక్ష్యంగా చలామణి
- గతంలో కలకలం రేపిన సంఘటనలు

నవతెలంగాణ-లక్షెట్టిపేట్

పట్టణంలో దొంగ కరెన్సీ నోట్లు మళ్లీ ప్రత్యక్షం అయ్యాయి. పలువురు కూలీలు, పేద, మధ్య తరగతి ప్రజలను టార్గెట్ చేసుకొని దొంగనోట్లు చలామణి చేస్తున్నట్లు సమాచారం. అలా వచ్చిన నోట్లు చిరువ్యాపారుల వద్దకు వచ్చినా వారు గుర్తించక నష్టపోతున్నట్లు వాపోతున్నారు. కొంతమంది వ్యాపారులు గుర్తించి తిరస్కరిస్తున్నారు. గతంలో రైతులను మోసగించిన పట్టణానికి చెందిన ఓ పత్తి వ్యాపారి నకిలీ నోట్ల వ్యవహారం జిల్లాలో సంచలనంగా మారింది. పట్టణంలోని గోదావరి రోడ్‌కు చెందిన ఓ యువ నాయకుడు సైతం దొంగ నోట్ల చలామణిలో తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొన్నాడు. తాజాగా మంగళవారం పట్టణంలోని ఓ చిరు వ్యాపారి నిత్యావసర సరుకులు విక్రయించే క్రమంలో ఓ గ్రామానికి చెందిన వ్యక్తికి నకిలీ వంద రూపాయల నోటు వచ్చింది. దీంతో ఆ గ్రామస్తుడు ఎవరికీ చెప్పుకోవాలో తెలియక దొంగ నోటు వ్యవహారం తిరిగి తనకే ఇబ్బందిగా మారుతుందని భావించి మౌనంగా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. అదే విధంగా బుధవారం బస్టాండ్ రోడ్డు వద్ద ఓ వ్యాపారి వద్దకు రెండు వందల రూపాయల నోట్లు రావడంతో గుర్తించి తిరస్కరించినట్లు తెలుస్తోంది. అలాగే చాలా మంది కూలీలు, ఇతర చిరువ్యాపారుల్లో ఈ నోట్లు మారుతుండటంతో అవి మార్కెట్లోకి చలామణి అవుతున్నాయి. ఇవి దొంగ నోట్లని తెలియక ప్రజలు మోసపోతున్నారు. ఒరిజినల్ నోటుకు దొంగ నోటుకు పెద్దగా తారతమ్యం లేకపోవడంతో సామాన్య ప్రజలు అసలు నోటును గుర్తించడం లేదు. చాలా మంది చివరకు బ్యాంకుల్లో అధికారులు తిరస్కరిస్తున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దొంగ నోట్లు చలామణి చేస్తున్న వ్యక్తులను గుర్తించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ నీరందించాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కడే హేమంత్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ కార్యక్రమంలో జిల్లాలోని ప్రతి ఇంటికి శుద్ధ జలం అందే విధంగా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. బుధవారం ఇంజనీరింగ్ విభాగాల అధికారులతో ఇంటింటికి మిషన్ భగీరథ నీరు అందించడంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి ఇంటికి మిషన్ భగీరథ ద్వారా శుద్ధ జలాన్ని అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సిర్పూర్(యు), లింగాపూర్, తిర్యాణి మండలాలలో వేసవికాలం దృష్ట్యా తాగునీటి ఎద్దడి లేకుండా రైతువేదికలకు మిషన్ భగీరథ నీటి పైపులైన్ ద్వారా నల్లా కనెక్షన్ అందించాలని, జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలకు మిషన్ భగీరథ నీరు అందే విధంగా అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. శ్మశాన వాటికల్లో బోర్లు వేయించాలని, మిషన్ భగీరథ ఇంజనీరింగ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శుల సమన్వయంతో వేసవికాలంలో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ముఖ్యంగా మారుమూల గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ అందించి తాగునీరు సరఫరా చేయాలని, చిన్న మరమ్మత్తులు అవసరమైన ప్రాంతాలలో త్వరితగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. మండలాల్లో ప్రతి 4వ శనివారం ఏర్పాటు చేసే సమావేశంలో మిషన్ భగీరథ ఇంజనీరింగ్ అధికారులు హాజరై తాగునీటి సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఈ వెంకటపతి, డిఈలు, ఏఈలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



విద్యుత్ షాక్‌తో గిరిజన రైతు మృతి



జైనూర్ : సిర్పూర్(యు) మండలం రాఘాపూర్ గ్రామానికి చెందిన కోవ బాజీరావు(46) విద్యుత్ షాక్ గురై మృతి చెందాడు. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం..బాజీరావు రబీ పంట పండిస్తున్నాడు. ఎప్పటిలాగే మంగళవారం కూడా చేనుకు వెళ్లాడు. రాత్రి అక్కడే ఉన్నాడు. మంగళవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం కురిసింది. బుధవారం ఉదయం తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. చేను పెన్సింగ్ తీగలపై విద్యుత్ తీగలు పడి విద్యుత్ సరఫరా అయింది. ఈదురుగాలులకు విద్యుత్ తీగలు తెగిపోయాయి. బుధవారం ఉదయం విద్యుత్ శాఖ అధికారులు తనిఖీ చేయకుండనే విద్యుత్ సరఫరా చేయడంతో బాజీరావు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లనే మృతి చెందినట్లు కుటుంబీకులు ఆరోపించారు. బాజీరావు కుమారుడు కోవ రాజేందర్ సిర్పూర్(యు) పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. న్యాయం చేయాలని కోరాడు. బాజీరావుకు ఇద్దరు కుమారులు, కుమార్తె, భార్య ఉన్నారు.

చట్టాల అమలు పోలీసుల బాధ్యత

- లింగాపూర్ పోలీస్‌స్టేషన్ తనిఖీ చేసిన ఎస్పీ సురేష్‌కుమార్



జైనూర్ : న్యాయబద్ధంగా చట్టాలను అమలు చేయడం పోలీసుల బాధ్యత అని ఎస్పీ సురేష్‌కుమార్ అన్నారు. బుధవారం లింగాపూర్ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లోని కేసు దర్యాప్తు వివరాలను ఎస్ఐ మనోహర్‌ను అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో రోజూవారీగా నమోదవుతున్న ఫిర్యాదులు, కేసు రికార్డులు, పోలీస్‌స్టేషన్ రిసెప్షన్, ల్యాప్‌టాప్, టెక్నికల్ గదులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విధుల పట్ల అంకితభావంతో పనిచేయాలని, ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. న్యాయబద్ధంగా చట్టాలను అమలు చేయడం పోలీసుల బాధ్యతగా భావించాలన్నారు. అనుమానిత వ్యక్తులు కనిపించిన వెంటనే తనిఖీ చేయాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా పటిష్టంగా పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. డ్రంకెన్ డ్రైవ్ కేసులను నివారించి ప్రమాదాలను నివారించడానికి కృషి చేయాలని ఆదేశించారు. ఆర్థిక నేరాలను కట్టడి చేయడానికి సీసీ కెమెరాలు అమర్చే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. విజువల్ పోలీసింగ్‌లో భాగంగా ప్రతిరోజు వాహనాల తనిఖీ నిర్వహించాలని తెలిపారు. రాత్రి పెట్రోలింగ్‌లో అధికారులు పాత నేరస్తులను తనిఖీ చేయాలని తెలిపారు. బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించే వారిపై కేసులు నమోదుచేయాలని,. సైబర్ నేరాల నియంత్రణ గురించి గ్రామ ప్రజలకు, యువతకు వీపీఓలు, పోలీస్ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ డీఎస్పీ శ్రీనివాస్, వాంకిడి సీఐ శ్రీనివాస్, జైనూర్ సీఐ రామకృష్ణ, లింగాపూర్ ఎస్ఐ మనోహర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్
గురువారం 27 ఏప్రిల్ 2023

సీపీఆర్‌పై పోలీసులకు అవగాహన

ఖానాపూర్ రూరల్ : పోలీసులు విధి నిర్వహణలో ఉన్న సమయంలో కానీ, నిత్యజీవితంలో కానీ ఎవరికైన హఠాత్తుగా గుండెపోటు వస్తే వారిని తక్షణమే రక్షించే పద్ధతులపై వైద్యులు పోలీసులకు అవగాహన కల్పించారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సర్కిల్ పరిధిలోని సిబ్బందికి సిపిఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు వంశీ మనిషి బొమ్మపై ప్రత్యక్షంగా గుండెపోటు సమయంలో రక్షించే పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో సిఐ నారాయణనాయక్, సర్కిల్ పరిధిలోని ఎస్‌ఐలు శంకర్, రాజు, ప్రభాకర్‌రెడ్డి, సర్కిల్ పరిధిలోని పోలీసు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



బస్టాండ్‌లో షీటీం సేవలపై అవగాహన

ఆదిలాబాద్‌టౌన్ : షీటీం సేవలను మహిళలు, విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన సూచించారు. షీటీం సేవలపై బుధవారం బస్టాండ్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఎవరైన ఆకతాయిలు ఇబ్బందులకు గురి చేసిన వెంటనే భయపడకుండా డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని షీటీం ఇంచార్జి, ఏఎస్‌ఐ సునీత పేర్కొన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.



ఆదిలాబాద్‌ను దత్తత తీసుకొని అభివృద్ధి

- ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు పున ప్రారంభిస్తాం
- ప్రభుత్వం రాగానే జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు
- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హామీ
- జోకుడుతోనే రామన్నకు మంత్రి పదవి వచ్చిందని వ్యాఖ్య

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్‌టౌన్

మరో ఏడాదిలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని.. ప్రభుత్వం ఏర్పడగానే ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. జల్,జంగల్, జమీన్ నినాదంతో నిజాం నవాబు, బ్రిటీషు రాజులపై కొట్లాడిన కొమురంభీం, రాంజీగోండ్‌లు పుట్టిన గడ్డ ఇదని..తొలితరం తెలంగాణ ఉద్యమ కారుడు, మంత్రి పదవిని త్యాగం చేసిన కొండా లక్ష్మణ్‌బాపూజీ, అయ్యోనివా..అవ్వోనివా అంటూ గళమెత్తిన గూడ అంజయ్య పుట్టిన నేల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అని కొనియాడారు. వీరి స్ఫూర్తితో కేసీఆర్ అనే కొరివి దయ్యాన్ని పొలిమేరలకు తరిమికొట్టేందుకు వేలాది మంది సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిరుద్యోగ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొనేందుకు ఆదిలాబాద్‌కు వచ్చిన రేవంత్‌కు పార్టీకి చెందిన ఉమ్మడి జిల్లా నాయకులు ఘన స్వాగతం పలికారు. తొలుత మావల జాతీయ రహదారి వద్ద పుష్పగుచ్ఛాలు అందించి ఆహ్వానించారు. అక్కడ్నుంచి ర్యాలీగా రిమ్స్ మీదుగా జిల్లా కేంద్రంలోనికి చేరుకున్నారు. స్థానిక కొమురంభీం చౌక్‌లో నాయకులు గజమాలతో సత్కరించారు. అక్కడ్నుంచి పాదయాత్రగా వివిధ కూడళ్ల మీదుగా అంబేద్కర్‌చౌక్‌కు చేరుకున్నారు. అక్కడ ఏర్పాటుచేసిన కార్నర్ మీటింగ్‌లో ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.

అధికారంలోకి వస్తే జిల్లాకు ప్రాధాన్యత

ఉమ్మడి రాష్ట్రంలోనూ ఆదిలాబాద్ జిల్లా వెనుకబడి ఉందని.. తెలంగాణ వచ్చిన తర్వాత కూడా చివరి స్థానంలోనే నిలిచిందని కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఉమ్మడి జిల్లాను దత్తత తీసుకొని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని రేవంత్ హామీనిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే జోగు రామన్నపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రగతిభవన్‌లో జోకుడు కారణంగానే రామన్న మంత్రి అయ్యారని..మాజీ మంత్రి అయ్యారని..

ఆయన కుమారుడు మున్సిపల్ ఛైర్మెన్ అయ్యారని విమర్శించారు. కుటుంబం కోసమే ఆయన జోకుతున్నారు తప్పితే.. ఆదిలాబాద్‌కు ఆయన చేసిందేమీ లేదని ఆరోపించారు. ఇప్పటికే ఆదిలాబాద్ జిల్లాలో రిమ్స్ ఆసుపత్రితో పాటు మెడికల్ కళాశాల మంజూరుచేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందని తెలిపారు. కాంగ్రెస్ పెద్దల సాక్షిగా చెబుతున్నానని అధికారంలోకి రాగానే జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటుతో పాటు ఇంజనీరింగ్ కళాశాల స్థాపిస్తామని హామీనిచ్చారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును తుమ్మిడిహెటీ వద్ద పున ప్రారంభించి జిల్లాలో 1.60లక్షల ఎకరాలకు సాగునీరందిస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పారు. ఆదిలాబాద్ జిల్లాలో ఓ నాయకుడు పార్టీ మారినంత మాత్రనా ఎలాంటి నష్టం జరగలేదని.. వెయ్యిమంది నాయకులు పుట్టుకొచ్చారని వ్యాఖ్యానించారు. వేలాదిమంది నిరుద్యోగులు తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. ఆదివాసీ బిడ్డలకు అన్ని విధాలా అండగా ఉంటామని స్థానిక నాయకుడు సీఆర్‌ఆర్ ఎవరికి ఏ కష్టం వచ్చినా అండగా ఉంటారని తెలిపారు. కష్టమొస్తే 5గంటలు సమయం ఇస్తే తాను ఆదిలాబాద్‌కు వస్తానని పేర్కొన్నారు. జిల్లావాసులు అధైర్యపడవద్దని కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 10అసెంబ్లీ సీట్లు గెలిపిస్తే..రాష్ట్రంలో 90సీట్లు గెలిపించే బాధ్యత తాను తీసుకుంటానని భరోసా కల్పించారు.

భారీగా హాజరైన జనం..!

నిరుద్యోగ నిరసన ర్యాలీలో పాల్గొనేందుకు రేవంత్‌రెడ్డి రావడంతో నిరుద్యోగులు, పార్టీ కార్యకర్తలు భారీగా హాజరయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా ఆదిలాబాద్ పట్టణానికి రావడంతో పార్టీ కార్యకర్తలతో పాటు పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి జనం తరలివచ్చారు. ఆయన ప్రసంగిస్తున్న సమయంలో ఉత్సాహంగా చప్పట్లు కొడుతూ కనిపించారు. స్థానిక కుమురంభీం చౌక్ నుంచి వినాయక్‌చౌక్, నేతాజీచౌక్ గుండా అంబేద్కర్ చౌక్ వరకు పాదయాత్ర చేపట్టారు. ఈ ర్యాలీలో నిరుద్యోగులు, వివిధప్రాంతాల నుంచి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.పట్టణంలో పార్టీ జెండాలు, నాయకుల ఫ్లెక్సీలను పెద్ద ఎత్తున ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు షబ్బీర్‌అలీ, రాంచంద్రారెడ్డి, సుదర్శన్‌రెడ్డి,గడ్డం వినోద్, గడ్డం ప్రసాద్, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, డా.మల్లురవి, ఏఐసీసీ కార్యదర్శి నదీంజావిద్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనరెడ్డి, ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు బల్మూరి వెంకట్, పార్టీ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, ఏఐసీసీ సభ్యురాలు గండ్రత్ సుజాత, ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు, ఆడె గజేందర్, వన్నెల అశోక్, జడ్పీటీసీలు గణేష్‌రెడ్డి, చారులత, నాయకులు సంజీవరెడ్డి, భరత్‌చౌహన్, సరస్వతి, భూపెల్లి శ్రీధర్, గుడిపెల్లి నగేష్, కొండ గంగాధర్, చరణ్‌గౌడ్, సామ రూపేష్‌రెడ్డి, శాంతన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి, పక్కన జీవన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, షబ్బీర్ అలీ తదితరులు



ర్యాలీగా అంబేద్కర్‌చౌక్‌కు వెళ్తున్న రేవంత్‌రెడ్డి, పార్టీ శ్రేణులు



నిరాశలో గండ్రత్ సుజాత..!

ఆదిలాబాద్‌లో నిర్వహించిన నిరుద్యోగ నిరసన కార్నర్ సభలో తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని ఏఐసీసీ సభ్యురాలు గండ్రత్ సుజాత నిరాశ చెందినట్లు తెలిసింది. కార్నర్ మీటింగ్‌లో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ ఆధ్వర్యంలో..మాజీ మంత్రి రాంచంద్రారెడ్డి సహకారంతో ఇంత పెద్ద సభ ఏర్పాటు చేశారని కొనియాడారు. కానీ పక్కనే ఉన్న గండ్రత్ సుజాత పేరు ప్రస్తావించకపోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర, జిల్లా నాయకుల పేర్లు అనేక మందివి ప్రస్తావించినా.. స్థానిక కీలక నాయకురాలైన సుజాత పేరు ఎక్కడా ప్రస్తావించకపోవడంతో ఆమెతో పాటు ఆమె వర్గీయులు కూడా నిరాశకు గురైనట్లు తెలిసింది.

బంద్ సంపూర్ణం

నవతెలంగాణ-బేల

ఆదివాసీ సంఘాల పిలుపు మేరకు మండల కేంద్రంలో బుధవారం బంద్ ప్రశాంతంగా ముగిసింది. బురాన్‌పూర్ శివారులోని రాంజీగోండు, కుమురం సూరు జెండాలను గ్రామ పంచాయతీ అధికారులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తొలగించారని, దీనికి నిరసనగా రెండు రోజుల క్రితమే వివిధ సంఘాల ఆధ్వర్యంలో బంద్‌కు పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం నుండే ఆదివాసీ నాయకులు మండల కేంద్రంలో తిరుగుతూ బంద్‌కు సహకరించాలని కోరగా వ్యాపారులు వారి వ్యాపార సముదాయాలను మూసివేసి బంద్‌కు సహకరించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. తుడుందెబ్బ మండల అధ్యక్షుడు నందు మాట్లాడుతూ భీం కాలనీలో అక్రమంగా వెలిసిన లేఅవుట్‌లను, భవనాలను తొలగించమంటే అక్కడున్న రాంజీగోండు, కుమురం సూరు జెండాలను ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తొలగించారని, తెలిపారు. బంద్‌కు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ జెండాలను తొలగించిన పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని, లేని యెడల ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు ఆడే శంకర్, నైతం సీతారాం, కోరంగే జంగ్ శావ్, సలాం దేవరావు, ఆదివాసీ విద్యార్థి పరిషత్, ఆదివాసీ సంక్షేమ పరిషత్, తుడుం దెబ్బ నాయకులు పాల్గొన్నారు.

బాసరలో నాలుగు ఇండ్లలో చోరీ



నవతెలంగాణ-బాసర

మండల కేంద్రంలో దొంగలు హల్‌చల్ చేశారు.. మంగళవారం అర్ధరాత్రి తాళాలు ఉన్న ఇండ్లను టార్గెట్ చేసి దోచుకున్నారు. తాళాలు ఉన్న నాలుగు ఇండ్లలోనే చోరీకి పాల్పడ్డారు. ఉప్పుకుంట కాలనిలోని గోదావరి ఇంటికి తాళం వేసి తన బంధువుల ఇంటికి బైంసాలోని చింతల్‌బోరి గ్రామానికి వెళ్లింది. గోదావరి ఇంటి గొళ్లెం పగులగొట్టి బీరువాలోని ఐదు వేల నగదు, రెండున్నర తులాల బంగారం దోచుకెళ్లినట్టు బాధితురాలి తెలిపింది. దూదేకుల బాబుమియా ఇంట్లో చొరబడి నాలుగు వేల నగదును దోచుకున్నారు. మైలాపూర్‌లోని ఎర్రం పాండురంగ ఇంటికి తాళాలు వేసి తన బంధువుల ఇంటికి వెళ్లాడు. దుండగులు పాండురంగ్ ఇంటి తలుపులను పగలగొట్టి ఇంట్లోకి చొరబడి 40,000 నగదు, మూడు తులాల బంగారు వెండి ఆభరణాలు దోచుకెళ్లినట్లు బాధితుడు తెలిపాడు. పక్కనే ఉన్న నర్సుబాయిని గడ్డపారతో బెదిరించి నగదు, బంగారం ఇవ్వాలని, లేదంటే చంపేస్తామని బెదిరించారు. భయపడిన నర్సు బాయ్ దొంగలు బాబోయ్ దొంగలని కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు లేచేసరికి దుండగులు పారిపోయారు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్‌ఐ మహేష్ సిబ్బందితో కలిసి చోరీకి గురైన ఇళ్లను పరిశీలించారు. సీఐ వినోద్‌రెడ్డి క్లూస్ టీం సిబ్బందితో కలిసి చోరీకి పాల్పడిన ఇళ్లను పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

మానవత్వం చాటుకున్న ఆర్టీసీ కండక్టర్

నవతెలంగాణ-ఉట్నూర్

ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికుడు మరచిన జీపీఎస్ బ్యాగును తిరిగి అందించి కండక్టర్ మానవత్వం చాటుకున్నాడు. ఆర్టీసీ కండక్టర్ డి.ప్రభుదాస్ తెలిపిన వివరాలు ప్రకారం బుధవారం ఉట్నూర్ బస్ డిపోకి చెందిన బస్సు (టీఎస్ 01యుసి 6688) ఆసిఫాబాద్ నుండి ఉట్నూర్‌కు వస్తోంది. కెరమెరిలో ఎక్కిన ప్రయాణికుడు రమేష్ రూ.30వేల విలువ గల జీపీఎస్ బ్యాగుతో టికెట్ తీసుకొని ప్రయాణించి గమ్యం వద్ద దిగి పోయాడు. బస్‌లో బ్యాగును గుర్తించిన కండక్టర్ వెంటనే ఉట్నూర్ ఆర్టీసీ అధికారులకు వివరించి బ్యాగును అందించాడు. ఈ విషయం తెలుసుకున్న ప్రయాణికుడు రమేష్ వెంటనే ఉట్నూర్ ఆర్టీసీ డిపోకు వెళ్లి బ్యాగు గురించి అధికారులకు వివరించాడు. అధికారులు జనార్దన్, రామకృష్ణ, మూర్తి బాధితుడుకి అందించారు. రూ.30వేల విలువ గల జీపీఎస్ బ్యాగు పోయిందేమోనని చాలా బాధపడ్డానని, తిరిగి అందజేసిన కండక్టర్ ప్రభుదాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఈదురుగాలులకు నేలకొరిగిన పంటలు

నవతెలంగాణ-తాంసి

ఈదురుగాలులతో కూడిన అకాల వర్షానికి తాంసి, భీంపూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో జొన్న, పెసరి, నువ్వు పంటలు నేలకొరిగాయి. చేతికి అందొచ్చిన పంటలు అకాల వర్షాలకు దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం మండల వ్యవసాయ అధికారి రవీందర్‌తో పాటు ఏఈఓలు నష్టం వాటిల్లిన పంట పొలాలను పరిశీలించారు. నష్టం అంచనా వేశారు. తాంసి మండలంలో దాదాపు 120 ఎకరాలు, భీంపూర్ మండలంలో 130 ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. నష్టం నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని మండల అధికారులు తెలిపారు.

వైద్య ఉద్యోగుల సంఘ నాయకులకు సన్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇటీవల ఎన్నికైన తెలంగాణ వైద్య ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం(హెచ్-1) జిల్లా అధ్యక్షుడు బండారి కృష్ణ, ప్రధాన కార్యదర్శి రఘురామరావు, సభ్యులను బుధవారం రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆవరణలో ఘనంగా సత్కరించారు. వైద్య ఆరోగ్య శాఖలో వివిధ రంగాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంఓ చంపత్‌రావు, సిబ్బంది రాజ్‌కుమార్, ఖుర్షిద్, అక్షయ్, షఫీ, నావిద్, ప్రమోద్ కుమార్ పాల్గొన్నారు.

నూతన విద్యావిధానాన్ని ఉపసంహరించుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పదో తరగతి పాఠ్యాంశంలోని డార్విన్ సిద్ధాంతం తొలగింపు, చరిత్రను కాలరాస్తూ తీసుకున్న నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని పిడిఎస్‌యు అధ్యక్షుడు సాయికుమార్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. నూతన విద్యా విధానాన్ని ఖండిస్తున్నామన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో సంఘం పక్షాన ఆందోళనలు చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కుమ్ర అశోక్, జిల్లా నాయకులు పెందూర్ శ్యాంసుందర్, రవీందర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పిల్లలకు ప్రోగ్రెస్ కార్డుల అందజేత

నవతెలంగాణ - పెంచికల్‌పేట్

మండలంలోని గుంట్లపేట్ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా, అంగన్‌వాడీ టీచర్ రాజమణి పిల్లలకు ప్రోగ్రెస్ కార్డులను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక విద్య కార్యక్రమంలో భాగంగా పిల్లలకు ప్రోగ్రెస్ కార్డు ఇచ్చామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు పూర్వ ప్రాథమిక విద్య పూర్తి చేయాలన్నారు. అలాగే గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందజేయాలని ఆమె అంగన్‌వాడీ టీచర్‌కు సూచించారు.

ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని రాస్తారోకో



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలో ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని బుధవారం అఖిలపక్ష నాయకులు భారీ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రమైన బోథ్‌లో ఫైర్‌స్టేషన్ లేకపోవడంతో అగ్ని ప్రమాదాల్లో ఆస్తినష్టం వాటిల్లుతోందన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ, ఇతర ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ప్రజలకు భారీ నష్టం వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అర్ధరాత్రి పేద కుటుంబానికి చెందిన సోహెల్ హోటల్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైందన్నారు. సుమారు రూ.50వేల వరకు ఆస్తినష్టం జరిగిందన్నారు. గ్రామస్తులు అగ్రహం వ్యక్తం చేస్తూ దాదాపు మూడు గంటల పాటు రాస్తారోకో నిర్వహించారు. మండలంలోని ప్రజాప్రతినిధులందరూ రాస్తారోకోలో పాల్గొనాలని డిమాండ్ చేశారు. సంఘటన స్థలానికి సీఐ కిరణ్‌కుమార్ వచ్చి సముదాయించారు.

రోడ్డు ఊడ్చి వీఓఏల నిరసన



నవతెలంగాణ-కడెం

వీవోఏలు చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా బుధవారం మండలంలో అంబేద్కర్ విగ్రహం ముందు రోడ్డు ఊడ్చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశించిన కార్యక్రమాలన్నింట్లో చురుగ్గా పాల్గొంటూ విజయవంతం చేస్తున్నామన్నారు. ప్రభుత్వం సానుకూల దక్పథంతో సమస్యలు త్వరగా పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మండల వివోఏలు పాల్గొన్నారు.

కుభీర్ : వివోఏల సంఘం అధ్యక్షుడు సాయినాథ్ ఆధ్వర్యంలో సమ్మెలో భాగంగా బుధవారం రోడ్డు ఊడ్చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, 10లక్షల ఆరోగ్య బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. నిరసనలో లక్ష్మీ, మంజుల, రమేష్, సాయినాథ్, లతిప్, విఠల్ పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రవీణ్

నవతెలంగాణ-బోథ్

విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మేడిచెల్మ ప్రవీణ్ ఎన్నికయ్యాడు. బుధవారం ఆదిలాబాద్‌లోని జిల్లా విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల వాసి పదవీ దక్కించుకున్నందుకు సంఘం సభ్యులు అభినందనలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి పదవీ కట్టబెట్టినందుకు జిల్లా, మండల సంఘ సభ్యులకు ప్రవీణ్ కృతజ్ఞతలు తెలిపారు.



స్వయం ఉపాధి పథకాలతో ఆర్థికాభివృద్ధి సాధించాలి : రాహుల్ రాజ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

స్వయం ఉపాధి పథకాల ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ పి.ఎస్ అన్నారు. బుధవారం టిఎన్జిఓ హాల్‌లో ఆహార శుద్ధి పరిశ్రమల సొసైటీ, హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిరుద్యోగ యువత, స్వయం సహాయక సంఘాలు, డ్వాక్రా మహిళలు, పారిశ్రామికవేత్తలకు ఏర్పాటు చేసిన ఆహార శుద్ధి పరిశ్రమల మిషనరీ ప్రదర్శన కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ముందుగా ప్రదర్శనలో ఏర్పాటు చేసిన మిషనరీల పని తీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిరుద్యోగ యువత సద్వినియోగపరచుకొని ఉపాధి, ఆదాయ మార్గాలను పెంచుకోవాలన్నారు. ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ఉత్పత్తి, తయారీ సంస్థలు క్రమబద్ధీకరణ పథకం (పీఎంఎఫ్‌ఎంఈ) సద్వినియోగ పరచుకొని ఆర్థిక అభివృద్ధి సాధించాలన్నారు. నిత్య జీవన విధానంలో సాంకేతిక వినియోగం పెరిగిందని, కాలానుగుణంగా వినియోగించే వస్తువుల రూపాల్లో, పని చేసే విధానంలో మార్పులు జరిగాయని అన్నారు. వివిధ రకాల ఆహార ఉత్పత్తుల మిషనరీల ప్రదర్శనపై పూర్తిగా అవగాహన పెంచుకొని ఉపాధి పొందాలని పేర్కొన్నారు. యువత పరిశ్రమల స్థాపనకు, వ్యాపార రంగంలో స్థిరపడేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పథకాలను ప్రవేశపెట్టి సబ్సిడీ అందజేస్తుందని, ఈ అవకాశాన్ని పట్టణ, గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగులు, మహిళలు సద్వినియోగపరచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, శిక్షణ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ పద్మభూషణ్ రాజు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, ఎల్డియం భాస్కర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడి శంకర్, యువతీ యువకులు, మహిళలు, వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.



గిరిజనుల అభ్యున్నతికి పెద్దపీట : ఎమ్మెల్యే రామన్న



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

గిరిజనుల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్ద పీట వేసిందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. బుధవారం మండలంలోని మామిడికోరి, దార్లొద్ది గ్రామాల్లో పర్యటించారు. ముందుగా మామిడికోరిలో రూ.2.10కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి గ్రామస్తులకు వివరించారు. దార్లొద్ది గ్రామంలో కోటి26 లక్షల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అంతకుముందు గ్రామస్తులు ఆయనకు బ్యాండు మేళాల నడుమ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదివాసి గ్రామాలకు పూర్తి సౌకర్యాలు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి కెసిఆర్‌దేనని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆదివాసి గ్రామాల్లో అన్ని వసతులు కల్పించాలన్న ఉద్దేశంతో ప్రణాళికాబద్ధంగా కార్యాచరణ అమలు చేశారని గుర్తు చేశారు. కోట్లాది రూపాయల వ్యయంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. విద్య లేని కారణంగా ఆదివాసులు వెనకబడుతున్నారన్న ఎమ్మెల్యే తల్లిదండ్రులు ఎన్ని కష్టాలు ఎదురైనా తమ పిల్లలను చదివించాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఎంపీపీ గండ్రత్ రమేష్, వైస్ ఎంపీపీ జంగు పటేల్, గ్రామ సర్పంచ్ టేకం పార్వతి చంద్రాజీ, పిఎసిఎస్ చైర్మన్ పరమేశ్వర్, నారాయణ, కుమ్ర రాజు, రమణ పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన అధికారులు, నాయకులు

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని పలు గ్రామాల్లో అకాల వర్షానికి నష్టం వాటిల్లిన రబీ పంటలను బుధవారం జెడ్పిటిసి గణేష్‌రెడ్డితోపాటు వ్యవసాయ శాఖ జెడి పుల్లయ్య, ఏడి రమేష్, తహసీల్దార్ వనజారెడ్డి పరిశీలించారు. భరంపూర్, నందిగామ, కొత్తనందిగామ, పల్లి-కే, పల్లి-బి గ్రామాల్లో మంగళవారం కురిసిన వడగండ్ల వానకు పంటలు పూర్తిగా నేల కొరిగాయి. కొద్ది రోజుల్లో చేతికందే దశలో రాళ్ల వర్షానికి పంటలు నష్టపోయామని రైతులు అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలిపారు. పంట నష్టం సర్వే వివరాలు రెండు రోజుల్లో జిల్లా అధికారులకు నివేదిస్తామని అధికారులు తెలిపారు. పంటలను పరిశీలించిన వారిలో మండల వ్యవసాయ శాఖ అధికారి మహేందర్, భరంపూర్ సర్పంచ్ భగీరథబాయి, ఉప సర్పంచులు నారాయణరెడ్డి, తెలంగరావు, మాజీ జెడ్పిటిసి బొల్లారం బాబన్న, రైతులు కేదారేశ్వర్‌రెడ్డి, ప్రతాప్, జగన్మోహన్‌రెడ్డి, వెంకన్న, శాస్త్రి, రాజు, సంజీవ్ పలువురు రైతులు ఉన్నారు.



ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలి

మంగళవారం కురిసిన రాళ్ల వానకు ఇల్లు దెబ్బతిందని, ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని కొత్తనందిగామ గ్రామానికి చెందిన గిరిజనుడు చెడ్మకి తులసీరాం కోరుతున్నాడు. గాలివానకు పైకప్పు రేకులు లేచిపోవడంతో ఇంట్లో ఉన్న నిత్యావసర వస్తువులతో పాటు బట్టలు తడిసి ముద్దయ్యాయని ఆవేదన వ్యక్తం చేశాడు.

రానున్న రోజుల్లో మరింత నాణ్యమైన వైద్య సేవలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



రానున్న రోజుల్లో జిల్లా కేంద్రంలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందనున్నట్లు జడ్పీటీసీ నాగేశ్వరరావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని అంకుసాపూర్ దగ్గర రూ.6 కోట్లతో నిర్మిస్తున్న ప్రభుత్వ ఆస్పత్రి భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాల మంజూరయిందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య అభివద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆస్పత్రి సూపరింటెండెంట్ కే స్వామి, డాక్టర్ సత్యనారాయణ, ఆరోగ్య మహిళ సభ్యులు మమత, లావణ్య, అరుణ పాల్గొన్నారు.

మాదారం-3 పంచాయతీలో టీబీ నిర్ధారణ పరీక్షలు

నవతెలంగాణ-తాండూర్

మండలంలోని మాదారం-3 పంచాయతీలో తాండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం టీబీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. వ్యాధి బాధితులుగా గుర్తించిన పదిహేను మంది తెమడ శాంపిలను సేకరించి ల్యాబ్‌కు పంపించారు. ఈ సందర్భంగా నోడల్ సూపర్‌వైజర్ నరేష్ మాట్లాడుతూ టీబీ వ్యాధిని తొలత గుర్తించినట్లయితే చికిత్స చేయడానికి సులువుగా ఉంటుందని తెలిపారు. పొగాకు ఉత్పత్తులు నమలడం ధూమపానం మద్యపానానికి దూరంగా ఉండడం వల్ల టీబీ వ్యాధి భారిన పడకుండా ఉంటారన్నారు. విపరీతమైనతెమడ దగ్గు ఉన్నవారు టీవీ పరీక్షలు చేయించుకోవాలన్నారు. తాండూర్ పీహెచ్‌సీ పరిధిలోని సబ్ సెంటర్ హెడ్ క్వార్టర్లలో టీవీ పరీక్షలు చేయడం జరిగిందని తెలిపారు. ఈ హెల్త్ క్యాంపులో పీహెచ్ఎస్ మహాలక్ష్మి, ఏఎన్ఎం పారిజాతం దుర్గం దౌలత్, హకీం పాల్గొన్నారు.

జన సంరక్షణ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-కౌటాల

మండలంలోని గురుడుపేట్ గ్రామంలో జన సురక్షా పథకాల నమోదులో భాగంగా కౌటాల తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో బ్యాంకు లావాదేవీలపై బ్యాంకు మేనేజర్ నరసింహస్వామి బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన పథకాల గురించి వారికి వివరించారు. 18 ఏండ్ల నుండి 50 ఏండ్ల వయసు గల వారు రెండు పథకాలను అందరు కలిగి ఉండాలని సూచించారు. 18 ఏండ్ల నుండి 70 ఏండ్ల వరకు సురక్షా బీమా యోజన పథకాన్ని కలిగి ఉండాలని ఖాతాదారులకు సూచించారు. సురక్షా బీమా పథకానికి సంవత్సరానికి గాను రూ.20 ప్రీమియం చెల్లించి రూ.రెండు లక్షల ప్రమాద బీమా పొందొచ్చని, అలాగే జీవనజ్యోతి బీమా యోజన పథకంలో రూ.436 ప్రీమియం చెల్లించి రూ.రెండు లక్షల సాదారణ బీమా పొందొచ్చని తెలిపారు. ఈ పథకంలో చేరడానికి తెలంగాణ గ్రామీణ బ్యాంకులో జమ ఖాతా ఉంటే సరిపోతుందని, అందులో డబ్బులు నిల్వ ఉంచుకోవడం వల్ల ప్రతి ఏడాది దానికదే రెన్యూవల్ అవుతూ పోతుందని సూచించారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మండలాధ్యక్షుడు మెరెపెల్లి బ్రహ్మయ్య, తెలంగాణ గ్రామీణ బ్యాంకు కౌటాల శాఖ అకౌంటెంట్ రాజేష్, గురుడుపేట్ సీఎస్‌పీ విలాస్, గ్రామ సర్పంచ్ మెర్పెల్లి బ్రహ్మయ్య, కొండయ్య, శంకర్, భీంరావు, వినోభి, సత్తయ్య, నారాయణ పాల్గొన్నారు.

ఎన్నికలలోపే మాలీలకు ఎస్టీ హోదా కల్పించాలి

- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే



నవతెలంగాణ-కెరమెరి

రాబోయే పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలలోపే గిరిజన రిజర్వేషన్లను 6 నుండి 10 శాతానికి పెంచి అందులో మాలిలను చేర్చి మాలీలకు ఎస్టీ హోదా కల్పించి న్యాయం చేయాలని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పేట్కులే డిమాండ్ చేశారు. బుధవారం కెరమెరి మండల కేంద్రంలోని సంఘ కార్యాలయంలో సంఘ సభ్యులతో కలిసి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ గిరిజన రిజర్వేషన్లను 6 నుండి 10 శాతానికి పెంచుతూ గత అసెంబ్లీలో తీర్మానం చేసి ఆమోదం కోసం కేంద్రానికి పంపారని, అందులో మాలికులస్తులను కూడా చేర్చుకున్నట్లు ప్రకటించారని తెలిపారు. కాగా గతంలో ముస్లిం రిజర్వేషన్ల బిల్లుతో కలిపి పంపారని, ఎస్టీ రిజర్వేషన్ల బిల్లును విడిగా పంపితే ఆమోదిస్తామని కేంద్ర మంత్రులు చెప్పడం జరిగిందని పేర్కొన్నారు. ఎస్టీ రిజర్వేషన్ల బిల్లును విడిగా పంపిన నేపథ్యంలో ఆలస్యం చేయకుండా వెంటనే ఆమోదించాలన్నారు.మాలీలలకు ఎస్టీ హోదా కల్పించి, సామాజిక న్యాయం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తమ పరిధిలో ఉన్న ఎస్టీ రిజర్వేషన్ కోసం ప్రత్యేక జీఓ తీసి ఈ ఎన్నికలలోపే మాలిలకు ఇచ్చిన మాట ప్రకారం ఎస్టీ హోదా కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పటేల్ సంఘం అధ్యక్షులు శెండే నారాయణ, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు వాడగురే విజయ్, మండల ఉపాధ్యక్షులు ఆదే శ్యామ్ రావు, సలహా సంఘ సభ్యులు శేండే సకారాం, ప్రచార కార్యదర్శి వాడయ్ సోమ మహారాజ్, కేలి(బి) సర్పంచ్ ఆదే నారాయణ, కార్యవర్గ సభ్యులు మొహుర్లే నగేష్, సీనియర్ సంఘ కార్యకర్త కోట్‌రంగే తిరుపతి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యం



నవతెలంగాణ-వేమనపల్లి

బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల అభివద్ధికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. బుధవారం మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే ముందుగా జిల్లేడ నుంచి జక్కపల్లి వరకు రూ. కోటి.33లక్షల సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. అనంతరం బుయ్యారం గ్రామంలో మన ఊరు మన బడి పనులు పరిశీలించి, కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రహదారులతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని భావించి ప్రభుత్వం మారుమూల గ్రామాలకు సైతం సీసీ రోడ్లు మంజూరు చేస్తుందని తెలిపారు. దేశంలో ఎక్కడలేని విధంగా అనేక సంక్షేమ పథకాలను అమలుపరుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కోళి వేణుమాధవ్ రావు, వైస్ ఎంపీపీ ఆత్రం గణపతి, సర్పంచ్‌లు చీర్ల కొండాల్‌రెడ్డి, గోగర్ల శ్రీనివాస్, కొండగొర్ల బాపు, మాజీ సర్పంచులు కొరకొప్పుల మధూకర్‌గౌడ్, రుద్రబట్ల లక్ష్మీనారాయణ, నాయకులు పురాణం లక్ష్మీకాంత్, అయిల్ల శ్రీనివాస్, మల్లయ్య, మల్లేష్, కిరణ్‌గౌడ్, కుమ్మరి బాపు, చెన్నూరి సంతోష్, ఎడ్ల ప్రశాంత్, గూడూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

హమాలీ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-తాండూర్

హమాలీలందరికీ భవన నిర్మాణ కార్మికుల వలె వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి, సంక్షేమ పథకాలు అమలు చేయాలని సీఐటీయూ మంచిర్యాల జిల్లా కార్యదర్శి దాగాం రాజారాం కోరారు. బుధవారం తాండూర్ హమాలి వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని భద్రత, గుర్తింపు కార్డులు, కనీస వేతనాలు, పిఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ వంటి చట్టబద్ధ హక్కులు కల్పించాలనికోరారు. గ్రామ సంఘాల ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఐకేపీ హామాలీలకు ప్రభుత్వమే బిల్లులు చెల్లించి, ప్రమాద బీమా, ఆరోగ్య భీమా, సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రభుత్వ గోదాంలో పనిచేస్తున్న హమాలీలను ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించి వారితో సమానంగా వేతనాలు అందించాలన్నారు. హమాలీలందరికీ ఇండ్ల స్థలాలు ఇచ్చి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని కోరారు. డిమాండ్ల సాధన కోసం ఏప్రిల్ 29న నచలో హైదరాబాద్ లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నాను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ధర్మరాజుల వెంకటేష్, ఇందూరి బానేష్, తమనవేణి శ్రీను, కామెరా బాబు, చంద్రగిరి తిరుపతి, ధరణి బుచ్చయ్య పాల్గొన్నారు.

కోచింగ్ పేరిట నిరుద్యోగులకు టోకరా..!

- రూ.లక్షల ఫీజు డబ్బులతో ఉడాయింపు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు



నవతెలంగాణ-మంచిర్యాల

నూటికి నూరు శాతం ఉద్యోగాలు వచ్చే విధంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తామని నమ్మించి నిరుద్యోగ యువత నుంచి రూ.లక్షల్లో ఫీజుల రూపంలో వసూలు చేసి ఊడాయించిన ఓ కోచింగ్ సెంటర్ నిర్వాకం బుధవారం జిల్లా కేంద్రంలో వెలుగు చూసింది. ఈ సెంటర్‌లో చేరిన బాధితులు తాము మోసపోయామని పేర్కొంటూ పోలీసులను ఆశ్రయించారు. కోచింగ్ సెంటర్ నిర్వాకంపై ఫిర్యాదు చేసిన అనంతరం బాధితులు మాట్లాడుతూ ఆస్పిరాంట్ కోచింగ్ సెంటర్‌లో గ్రూప్-2, 4 పరీక్షలకు వంద శాతం ఉద్యోగాలు వచ్చే విధంగా నిపుణులైన వారితో శిక్షణ ఇప్పిస్తామని సెంటర్ నిర్వాకుడు నిహార్ వర్మ నమ్మించడంతో వందమంది చేరామని తెలిపారు. శిక్షణ కాలంలో రూ.13 వేల ఫీజు ఉంటుందని చెప్పగా చాలామంది డబ్బులు చెల్లించామని, కొద్దిరోజులుగా శిక్షణ కేంద్రాన్ని మూసి ఉంచడంతో వివరణ కోరితే నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని తెలిపారు. సెంటర్‌ను మూసి ఉంచడంతో డైరెక్టర్‌ను ఫోన్లో సంప్రదిస్తే సమాధానం ఇవ్వడం లేదని, దీంతో మోసపోయామని గ్రహించి న్యాయం కోసం పోలీసులు ఆశ్రయించినట్లు తెలిపారు.

అనుమతి లేని నిర్మాణాలు చేపడితే చర్యలు

- డీఎల్పీఓ ఫణిందర్ రావు



నవతెలంగాణ-తాండూర్

పంచాయితీల పరిధిలో అనుమతి లేని నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని డీఎల్పీఓ ఫణిందర్‌రావు తెలిపారు. బుధవారం మండలంలోని మాదారం, మాదారం-3 పంచాయతీలలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదారం మాదారం-3 పంచాయతీలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. నిర్మాణాల నిలుపుదల కూల్చివేతకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ అసైన్మెంట్ వ్యవసాయ భూముల్లో పంచాయతీ అనుమతి లేని నిర్మాణాల విషయమై రెవెన్యూ శాఖకు లేఖ రాయనున్నట్లు తెలిపారు. పంచాయితీల ఆదాయాలకు గండి కొడుతూ అక్రమ లేఔట్లు, వెంచర్లు ఏర్పాటు చేసినట్లయితే కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామ అన్నారు. పంచాయతీ అనుమతి లేకుండా అక్రమంగా నిర్మాణాలు చేపడితే పంచాయతీ కార్యదర్శులు పోలీసు, రెవిన్యూ సహకారంతో కూల్చివేయాలని తెలిపారు. అందుకు జిల్లా పంచాయతీ అధికారుల సహకారం ఉంటుందన్నారు. 2020 అక్టోబర్ మాసం వరకు పంచాయతీలోని నిర్మాణాలకు ప్రభుత్వం ఇంటి నెంబర్లు కేటాయించిదని తెలిపారు. తర్వాత పంచాయితీలలో అర్హత పత్రాలు లేకుండా నిర్మాణాలు చేపడితే ఇంటి నెంబర్లు ఇవ్వరాదన్నారు. డిమాండ్ పుస్తకములో వివరాలు పొందుపరచని, అర్హత అనుమతి పత్రాలను ఇండ్లకు ఇంటి నెంబర్లు కేటాయించరాదన్నారు. అక్రమంగా ఇంటి నెంబర్లు కేటాయించినట్టయితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొందరు పంచాయతీ అధికారులు పైఉద్యోగాలకు వెళ్లే యోచనలో పంచాయితీ వ్యవస్థ రాజ్యాధికారాన్ని దుర్వినియోగంచేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. అధికార దుర్వినియోగం నిజనిరుపన జరిగినట్లయితే ఆయా పంచాయితీ అధికారులపై చర్యలు తీసుకోవడమే కాకుండా పైఉద్యోగాలకు పెళ్లెందుకు అనర్హులుగా ప్రకటించడం జరుగుతుందన్నారు. పంచాయితీ అధికారులు జాగరుతతో వ్యవహరించాలని సూచించారు. డీఎల్పీఓ వెంట ఎంపీఓ సత్యనారాయణ, మాదారం సర్పంచ్ సాగరిక మంగీలాల్, కార్యదర్శి సౌందర్య ఉన్నారు.

కమీషన్ల కోసమే అభివృద్ధి పనులు

- ఎమ్మెల్యే, చైర్మన్ ఊరిలో నిలిచిపోయిన అభివృద్ధి
- కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు తూముల నరేష్
- పాత మంచిర్యాలలో నిరసన ప్రదర్శన

నవతెలంగాణ-మంచిర్యాల



అభివృద్ధి పనుల పేరుతో అధికార పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు కమీషన్లు దండుకుంటున్నారని, ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. అభివృద్ధి పనులు చేపట్టడానికి ఆర్భాటంగా శిలాఫలకలతో ప్రారంభోత్సవాలు చేపట్టి ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపిస్తూ బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని పాత మంచిర్యాలలో కాంగ్రెస్ పార్టీ నిరసన ప్రదర్శన చేపట్టింది. ఏర్పాటుచేసిన శిలాఫలకాలకు పూలమాలలు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ పార్టీ అధ్యక్షుడు తూముల నరేష్ మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ ఆదేశాల మేరకు పట్టణములోని 36 వార్డుల్లోని సమస్యలపై పోరాటం మొదలు చేశామన్నారు. పట్టణం సమస్యల వలయంలో చిక్కి అధ్వాన్నంగా మారిందన్నారు. ఎన్నికలు 6 నెలలు ఉన్నందున ఎక్కడికక్కడ కమిషన్ల కోసం శిలాఫలకాలు పెడుతూ కొబ్బరికాయలు కొడుతూ కాంట్రాక్టర్లకు పనులు అప్పజెప్పి పనులు పూర్తీ కాకముందే కమిషన్లు తీసుకునే కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే దివాకర్ రావు పెట్టుకున్నారన్నారు. పాతమంచిర్యాలలో 3 సంవత్సరాల క్రితమే దాతలు ఇచ్చిన స్థలంలో స్మశాన వాటిక నిర్మాణం పేరిట నిధులు విడుదల చేసుకొని చైర్మన్ జెబులో వేసుకున్నారన్నారు. మిషన్ భగీరథ పేరిట రోడ్లు నాశనం చేసి నిమ్మకు నీరెత్తినట్టు చూస్తూ ఉండిపోయారన్నారు. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు పెంట రజిత మాట్లాడుతూ సాయి బాబా ఆలయం నుండి ఆండాళమ్మ కాలనీ వరకు రోడ్డుకు శిలాఫలకం వేసి ఇప్పుడు రంగంపేట వరకే చేయడంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. అదే విదంగా రంగంపేట స్కూల్ కూలి పోయి 3 సంవత్సరాలు గడుస్తున్నా తిరిగి నిర్మించడంలో ఎమ్మెల్యే విఫలం అయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చింతకింది మల్లయ్య, సింగల్ విండో డైరెక్టర్ తూముల వెంకటేష్, బొల్లం భీమయ్య మహిళా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పుట్ట లావణ్య, బొలిశెట్టి అంజన్న, బొల్లం సత్యం, నాగుల తిరుపతి, అరె దేవేందర్, ఆకుల స్వామి, తిరుపతి, కుమార్ యాదవ్, అంకం సతీష్ పాల్గొన్నారు.

రోడ్లు ఊడ్చి వీఓఏల నిరసన

- 10వ రోజుకు చేరిన సమ్మె

నవతెలంగాణ-ఆసిఫాబాద్



తమ సమస్యలు పరిష్కరించాలని ఐకేపీ వీఓఏలు చేస్తున్న సమ్మె 10వ రోజు చేరిన సందర్భంగా అంబేద్కర్ చౌక్ వద్ద ప్రధాన రహదారిపై రోడ్లు ఊడ్చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వీఓఏల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు జాదవ్ రాజేందర్ మాట్లాడుతూ వీఓఏలను సేర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత, కనీస వేతనం రూ.26000, పది లక్షల సాధారణ భీమా, ఆరోగ్య బీమా సౌకర్యం, సెర్ప్ నుండి ఐడి కార్డులు, గ్రామ సంఘం గ్రేడింగ్ సంబంధం లేకుండా ప్రతినెల వ్యక్తిగతంగా ఖాతాలకు వేతనాలు జమ చేయాలన్నారు. డిమాండ్ల పరిష్కారం అయ్యేవరకు సమ్మె విరమించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షురాలు జ్యోతి, మండల అధ్యక్ష కార్యదర్శులు బుద్దు, రమ, ప్రమోద్, సుదర్శన్, సంజీవ్, సరిత, స్వప్న ప్రియా, కవిత, మహేష్ పాల్గొన్నారు.

పోరాటాల ద్వారానే కార్మిక హక్కుల పరిరక్షణ

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి మధు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

పోరాటాల ద్వారానే కార్మిక హక్కులు పరిరక్షించబడుతాయని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి మధు అన్నారు. బుధవారం కాగజ్‌నగర్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు అల్లూరి లోకేష్ అధ్యక్షతన జిల్లా స్థాయి కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలపై కూడా దాడులు చేస్తోందని, ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అన్నారు. చికాగో వీరుల మేడే స్ఫూర్తితో పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని దినాలను ఇప్పటికే 12 గంటలకు పెంచడమే కాకుండా, సమ్మె చేసే హక్కు లేకుండా చేసిందని అన్నారు. కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత లేదని అన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో మేడే ఉత్సవాలను ఏడు రోజుల పాటు జరుపుకోవాలని సూచించారు. మేడే రోజు మండల కేంద్రాలలో ర్యాలీలు, సభలు, రెండో రోజు అన్ని గ్రామాలలో జెండావిష్కరణలు, తదనంతరం ఐదు రోజుల పాటు కార్మికులలో సృజనాత్మకతను వెలికితీసేవిధంగా ఆటల పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు అంబాల ఓదేలు, నాయకులు ఆర్ త్రివేణి, ముంజం ఆనంద్‌కుమార్, రాజేందర్, కృష్ణమాచారి, వై ఆరుణ, శంకర్, శ్రీకాంత్, చంద్రశేఖర్, వివిధ రంగాల కార్మికులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభించిన జడ్పీ చైర్‌పర్సన్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఎంఎం హెల్ప్ లైన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎండి మహమూద్ జ్ఞాపకార్థం చైర్మన్ ఎండి అహ్మద్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఆసిఫాబాద్ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలెక్టర్ కార్యాలయానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, ఫౌండేషన్ డైరెక్టర్ అబ్దుల్ రహమాన్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అహ్మద్ బిన్ అబ్దుల్లా, పార్టీ నాయకులు సయ్యద్ నిసార్, షబ్బీర్, అమర్ బీన్ అహ్మద్, ఉబెద్ బీన్ యాహియ, తాజ్, ఖలీల్, పెంటు, సూఫీయాన్, అరిఫ్ పాల్గొన్నారు.

ఆదివాసీ గ్రామాల్లో ఆరోగ్య ఉప కేంద్రాలను ఏర్పాటు చేయాలి

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేముల కృష్ణ



నవతెలంగాణ-కాసిపేట

ఆదివాసీ గ్రామాల్లో ఆరోగ్య ఉపకేంద్రాలు ఏర్పాటు చేయాలని పెద్దనపల్లి సర్పంచ్ వేములకృష్ణ పేర్కొన్నారు. బుధవారం ఆయన ఉట్నూర్ ప్రాజెక్ట్ పీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. కాసిపేట మండలంలోని వెంకటాపూర్, రొట్టెపల్లి, తిరుమలపూర్, పెద్దనపల్లి నాయకపుగుడా, సోనాపూర్ గ్రామాల్లో ఆరోగ్య ఉప కేంద్రాలు లేనందున గర్భిణీ, బాలింతలకు అనారోగ్య సమస్యలు ఏర్పడినప్పుడు వైద్య పరీక్షలు చేయించుకునేందుకు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రానికి రావాల్సి వస్తుందని, పూర్తిగా ఏజెన్సీ మండలం కావడంతో, ఈ గ్రామాల్లో మెరుగైన వైద్యం అందే విధంగా ఉండేందుకు వెంకటాపూర్, నాయకపుగుడెంలో(పెద్దనపల్లి) ఆరోగ్య ఉప కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతూ ఉట్నూరు ఐటీడీఏ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేసినట్లు పేర్కొన్నారు.

తెలంగాణ బలహీన వర్గాల సంక్షేమ సంఘం అధ్యక్షుని నియామకం

నవతెలంగాణ-కోటపలి

తెలంగాణ బలహీన వర్గాల సంక్షేమ సంగం గౌరవ అధ్యక్షుడిగా చెన్నూర్ పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది ఏ.రాంబాబును నియమించినట్లు టీబీఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజలింగు మోతే బుధవారం తెలిపారు. అనంతరం రాజలింగు మాట్లాడుతూ బలహీనవర్గాల ప్రజలకు అండగా సంఘం ఉంటుందని, వారిని సాంఘికంగా, సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా చైతన్యం చేయడమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు బలహీన వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలను చైతన్యం చేస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఎల్పుల వెంకటస్వామి ఉన్నారు.

అనుదినం జనస్వరం www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
4
గురువారం 27 ఏప్రిల్ 2023

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని తాళ్లపేట గ్రామపంచాయతీ పరిధిలో మిషన్ భగీరథ పంపు డ్రైవర్‌గా పనిచేస్తున్న బొల్లం రాజయ్య అనే వ్యక్తి ఇటీవల మరణించగా మాజీ వైస్ ఎంపీపీ ఆకుల రాజేందర్ ఉపసర్పంచ్ పుట్టపాక తిరుపతి మృతుని కుటుంబానికి రూ.6000 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజయ్య గ్రామానికి పంప్ డ్రైవర్‌గా ఎనలేని సేవలు చేశాడని అన్నారు. ఆయనది పేద కుటుంబం కావడంతో ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. గ్రామంలోనీ పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేస్తూ ఆదుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు మేడ దయాకర్, నారా శ్రీనివాస్, సూరి పాల్గొన్నారు.

నిరుపేద యువతి పెండ్లికి డ్రెస్సింగ్ టేబుల్ అందజేత

నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన నిరుపేద దళిత అమ్మాయికి పెళ్ళికానుకగా డ్రెస్సింగ్ టేబుల్‌ను అందజేసి మంత్రి వ్యక్తిగత సహాయకులు(పీఏ) కృష్ణంరాజు తన ఉదాహరణ చాటుకున్నారు. ఖానాపూర్ పట్టణం గాంధీ నగర్‌కి చెందిన సోరపాక దీప కి.నూతనంగా వివాహం కాగా బుధవారం మంత్రి వర్యులు ఐకేరెడ్డి, వ్యక్తిగత పీఏ.కష్టం రాజు దంపతులు ఇద్దరికి నూతన వస్త్రాలు, డ్రెస్సింగ్ టేబుల్‌ని, కానుకగా అందజేశారు. ఇందులో బీసీ రమేష్, ఎడ్లలి లిరాజేశ్వర్, చింతపండు రవి, కాలేరీ దివాకర్, సంగర్తి రాజన్న, బొమ్మెన రాకేష్, మామిడిపల్లి రాజు, బీమేష్ పాల్గొనడం జరిగింది.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి

నవతెలంగాణ-సారంగాపూర్


సారంగాపూర్‌లో..

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర దేవాదాయ, న్యాయ, అటవీ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఆలూరు గ్రామంలో సీపీఎస్ అధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ సారథ్యంలో రైతు సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేశారన్నారు. రైతు బంధు, రైతు బీమా, రైతులకు 24గంటల ఉచిత విద్యుత్ తోపాటు మండలంలో విద్యుత్ సబ్ స్టేషన్లు, స్వర్ణ వాగుపై చెక్ డ్యామ్ నిర్మాణం వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే విక్రయించి మొదటి రకం వరి ధాన్యానికి క్వింటాలుకు రూ.2060, రెండవ రకానికి రూ.2040 ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రామ్ బాబు, పారిశ్రామిక వేత్త అల్లోల మురళీధర్ రెడ్డి, రైతు బంధు జిల్లా అధ్యక్షులు వెంకట్ రామ్‌రెడ్డి, ఎంపీపీ మహిపాల్ రెడ్డి, సొసైటీ చైర్మన్‌లు నారాయణ రెడ్డి, మాణిక్‌రెడ్డి, అడెల్లి పోచమ్మ చైర్మన్ చందు, ఎఎంసీ చైర్మన్ ఆశ్రిత శ్రీనివాస్ రెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ లక్ష్మీ నారాయణ, ఎంపీపీ పఠానీ రాధ, గ్రామ సర్పంచ్ దండు రాధ, బీఆర్ఎస్ మండల కన్వీనర్ మాధవ్ రావు పాల్గొన్నారు.


నిర్మల్‌లో..

బాధిత కుటుంబాలకు పరామర్శ

నిర్మల్ : నిర్మల్ పట్టణంలోని గాజులపేట్‌లో రెండు రోజుల క్రితం అగ్నిప్రమాదం సంభవించి పర్స లక్ష్మీ, పర్స భూమేష్‌ల ఇండ్లు పూర్తిగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి బుధవారం గాజులపేట్ వెళ్లి కాలిపోయిన ఇండ్లను పరిశీలించారు. బాధిత కుటుంబాలను పరామర్శించి అధైర్య పడవద్దని ఆదుకుంటామని తెలిపారు. ఒక్కో కుటుంబానికి రూ.95 వేల తక్షణ సాయం అందించి నెల లోపు రూ.3 లక్షలతో ఇండ్లను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్ సుభాష్‌చందర్‌ను ఆదేశించారు. అనంతరం బాధిత కుటుంబాలకు 25 కిలోల చొప్పున బియ్యం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. అనంతరం వార్డులో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన బోర్‌ను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మెన్ ధర్మాజీ రాజేందర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మారుగొండ రాము, హజ్ కమిటీ అధ్యక్షుడు నాజీరోద్దీన్, కౌన్సిలర్లు ముజాయిద్ చౌస్, ఖాజా మాజిదోద్దీన్, మున్సిపల్ కమిషనర్ సీవీఎస్ రాజు ఉన్నారు.

రోడ్డు ఊడ్చి నిరసన తెలిపిన వీఓఏలు



నవతెలంగాణ-నిర్మల్

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం వీఓఏలు రోడ్డు ఊడ్చి నిరసన తెలిపారు. నిర్మల్, సోన్ మండల కేంద్రాల్లో నిర్వహిస్తున్న సమ్మె శిబిరాలను సందర్శించి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వీఓఏల సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా పోరాటం నిర్వహిస్తామని చెప్పారు. మహిళ సంఘాలతో కలిసి పోరాడాలన్నారు. వీఓలను ప్రభుత్వం వెంటనే సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. గ్రేడింగ్ విధానంలో కాకుండా నెలవారీగా బ్యాంక్ అకౌంట్‌లో వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సాయన్న, పోశెట్టి, నిర్మల్ రూరల్ అధ్యక్షురాలు గాయత్రి, కోశాధికారి సింధు, స్రవంతి, సునీత, రజిని, లక్ష్మీ, గోదావరి, కవిత పాల్గొన్నారు.

ముథోల్ : మండలకేంద్రమైన ముథోల్ లోని ఎంపీడీఓ కార్యాలయం ముందు శుక్రవారం వీఓఏలు రోడ్లను ఊడస్కుంటూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వీఓఏల అధ్యక్షుడు కమలి రాజు మాట్లాడుతూ ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని డిమాండ్ చేశారు. ఐడీ కార్డు గ్రామ సంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతి నెల తమ వేతనం వ్యక్తిగత ఖాతాలో వేయాలని పేర్కొన్నారు. తమతో ఆన్‌లైన్ పనులు చేయించకూడదని, అర్హులైన వీఓఏలను సీసీలుగా పదోన్నతి కల్పించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అష్ట ఉప సర్పంచ్ సంధ్యారాణి సునీల్ వీఓఏలకు సంఘీభావం తెలిపారు. సమ్మెలో వీఓఏల సంఘం కార్యదర్శి కెర్భ, కోశాధికారి శ్రీలత, వీఓఏలు మల్లెపూల ఓమేష్, సునంద, రమాదేవి, ఫాతిమా, పోశెట్టి, లత, రాజు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలి



నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని కొనుగోలు కేంద్రాలను మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తాళ్లపెట్, మామిడిపల్లి గ్రామాలలో ఇటీవలే కురిసిన అకాల వర్షానికి నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం అమ్మడానికి వచ్చే రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని నిర్వాహకులను ఆదేశించారు. ధాన్యం తడవకుండా సరిపడా టర్పలిన్ కవర్లు అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. అకాల వర్షానికి నష్ట పోయిన పంటల వివరాలు నమోదులో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని సంబంధిత శాఖ అధికారులను హెచ్చరించారు. నష్టపరిహానికి సంబంధించిన గణాంకాలు తయారు చేసి పంపాలని ఆదేశించారు. ఆయన వెంట మండల తహసీల్దార్ హనుమంతరావు, ఆర్ఐ గుమ్ముల రంజిత్ కుమార్, ఎఈఓ అనిల్ ఉన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణ పోస్టర్లు విడుదల

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మండలంలోని ఈదులవాడ గ్రామపంచాయతీ పరిధిలో వచ్చేనెల 5వ తేదీన ఏర్పాటు చేయనున్న అంబేద్కర్ విగ్రహావిష్కరణ పోస్టర్‌ను జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కోవలక్ష్మి, జడ్పీటీసీ నాగేశ్వరరావు లు కమిటీ సభ్యులతో కలిసి వేరువేరుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చరిత్ర గుర్తుంచుకోవాల్సిన గొప్ప వ్యక్తి అంబేద్కర్‌అని అన్నారు. విగ్రహాలు పెట్టడమే కాకుండా ఆయన ఆశయాలు కొనసాగేలా ప్రవర్తించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ యాదవ్, వైస్ ఎంపీపీ సుంకరి పెంటయ్య, జైనూరు మండల అధ్యక్షుడు ఇంతియాజు లాల, సర్పంచులు భీమేష్, బాబురావ్, శ్రీనివాస్, మహేష్, ఎంపీటీసీ రమేష్, సోమశేఖర్, సుధాకర్, సురేష్, జిల్లా కమిటీ జాడిబాపు, నాయకులు షర్ఫోద్దిన్, ముషీర్ పాల్గొన్నారు.

అంధత్వ నిర్మూలన ప్రభుత్వ లక్ష్యం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అందత్వ నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యమని జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు అన్నారు. ఎంపీపీ మల్లికార్జున్‌తో కలిసి మండలంలోని అడలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి కంటి చూపు అందించి అందత్వ నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. కంటి వెలుగును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించుకున్న వారికి కంటి అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ ఆలీ బిన్ అహ్మద్, నిసార్, హైమద్, అబ్దుల్ రహమాన్, అమర్ బిన్ అహ్మద్, బురుగుడా ఎంపీటీసీ రమేష్, డాక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎత్తిపోతల పైప్‌లైన్ మరమ్మతుల పరిశీలన

నవతెలంగాణ-దండేపల్లి



గూడెం ఎత్తిపోతల పథకం పైప్ లైన్ మరమత్తుల పనులను బుధవారం మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పరిశీలించారు. ముందుగా దండపల్లిలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం అమ్మడానికి వచ్చే రైతులకు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా చూడాలని కొనుగోలు కేంద్రాల నిర్వహకులకు సూచించారు. ఇటీవల గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా ఆయకట్టు రైతులకు సాగునీరు అందించడంలో తీవ్ర ఆటంకాలు ఎదురయ్యాయని అన్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పాత పైపుల స్థానంలో కొత్తగా ఎంఎస్ఎంఈ అమర్చే విధంగా కృషి చేసినట్లు ఆయన తెలిపారు. పైపుల నిర్మాణం పకడ్బందీగా చేపట్టాలని గుత్తేదారులకు సూచించారు. తెలంగాణ ప్రభుత్వం రైతుల కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని రైతు ప్రభుత్వంగా పేరుగాంచిందని ఆయన అన్నారు. భవిష్యత్తులో రైతులకు గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా ఎలాంటి ఆటంకాలలు ఏర్పాడకుండా చర్యలు తీసుకుంటానమని రైతాంగానికి నిరంతరం నీరు అందేలా చూస్తామన్నారు ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ లింగన్న, ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, నడిపెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బీఆర్ఎస్ నాయకులు విజిత్ రావు పాల్గొన్నారు.

మండలాభివృద్ధిపై ఇన్‌ఛార్జి ఎంపీడీఓ సమీక్ష

నవతెలంగాణ-భీమిని



మండలంలో చేపడుతున్న అభివృద్ధి పనులపై ట్రేని కలెక్టర్, ఇంఛార్జి ఎంపీడీఓ గౌతమి వివిధ శాఖ అధికారులతో ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల విషయంలో నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. ప్రతీ గ్రామ పంచాయతీలలోని నర్సరీలలో వంద శాతం మొక్కలు బతికేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఉపాధి పనులు తప్పని సరిగా నిర్దేశించి గడువులోగా పూర్తి అయ్యేల చర్యలు తీసుకోవాలని క్షేత్ర సహాయకులకు సూచించారు. కూలీలకు సకాలంలో పేమెంట్ చేయాలని అన్నారు. లక్ష్మీపూర్ గ్రామ పంచాయితీ లోని తెలంగాణ క్రీడా ప్రాంగణం పనులు రేపటిలోగా పూర్తి చేయాలని గ్రామ కార్యదర్శిని ఆదేశించారు. అనంతరం భీమినీ గ్రామ నర్సరీని సందర్శించి 100 శాతం జర్మినేషన్ ఉన్నందుకు కార్యదర్శిని అభినందించారు. అదే విధంగా డంపింగ్ యార్డ్‌ను సందర్శించి వార్మికాంపోస్ట్ చాలా బాగా తయారు చేస్తున్నారని కొనియాడారు. వైకుంటదామాలను సందర్శించి చుట్టూ ఫెన్సింగ్ వేయాలని కార్యదర్శిని ఆదేశించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి షేక్ సఫ్దర్‌అలీ, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

ప్రాణాలు కాపాడడంలో సీపీఆర్ కీలకం



నవతెలంగాణ-నిర్మల్

ప్రమాద సమయాల్లో ప్రాణాలు కాపాడడంలో సీపీఆర్ కీలకమని ఎస్పీ ప్రవీన్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది కార్డియోపల్మనరీ రిసేసిటేషన్, ఆటోమేటిక్ ఎక్స్టర్నల్ డిఫిబ్రిలేటర్ వచ్చినప్పుడు చేయాల్సిన ప్రథమ చికిత్సపై పోలీస్ అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ ప్రవీన్‌కుమార్ మాట్లాడారు. గుండె పోటు వచ్చిన వ్యక్తికి తక్షణ ప్రథమ చికిత్స అందించడం వల్ల ప్రాణాలను కాపాడొచ్చని తెలిపారు. సీపీఆర్‌పై అవగాహన ఉంటే ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని కాపాడవచ్చని చెప్పారు. ఇటీవల హైదరాబాద్‌లో ట్రాఫిక్ కానిస్టేబుల్ సీపీఆర్ అందించడం ద్వారా ఒక వ్యక్తి ప్రాణాలను కాపాడారని గుర్తు చేశారు. అనంతరం డీఎంహెచ్ఓ ధన్‌రాజ్ మాట్లాడారు. యాక్సిడెంట్స్ గాని, ఫిట్స్ గాని, హార్ట్ ఎటాక్ వచ్చినప్పుడు అత్యవసర సమయంలో ఏం చేయాలో చాలా మందికి తెలియదని అన్నారు. ఆ సమయంలో హార్ట్ ఎటాక్‌కు గురైన వారికి సీపీఆర్ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఏఓ వెంకట శేఖర్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ అజయ్‌బాబు, వైద్యులు సమత, శ్రీనివాస్, రాజేందర్ ఉన్నారు.

బీడీ కార్మికులకు పెరిగిన కరువు భత్యం అమలు చేయాలి

నవతెలంగాణ-నిర్మల్

బీడీ కార్మికులకు ఏప్రిల్ నుంచి పెరిగిన కరువు భత్యం అమలుచేయాలని బీడీయాజమాన్యాలను తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కట్ల రాజన్న డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో బుధవారం కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడులూ బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న అన్ని కేటగిరీలకు చెందిన బీడీ కార్మికులకు ఏప్రిల్ 1వ తేదీ నుంచి రూ.9.40 పైసలు పెరిగిన కరువు భత్యం అమలు చేయాలని అన్నారు. రాష్ట్రంలో వ్యవసాయం తర్వాత ఎక్కువ మందికి ఉపాధినిచ్చే పరిశ్రమ బీడీ పరిశ్రమేనని అన్నారు. కొన్ని బీడీ పరిశ్రమ యాజమాన్యాలు పెరిగిన కరువుభత్యం అమలు చేయడం లేదన్నారు. కార్మికులకు వేతన దోపిడీ చేస్తే బకాయిలుతో సహా చెల్లించాలని, లేకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో లక్ష్మీ, సునీత, గంగామణి, సౌమ్య, రాజమణి పాల్గొన్నారు.

పంట నష్టాన్ని పరిశీలించిన కలెక్టర్



నవతెలంగాణ-కడెం

కడెం మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామంలో దెబ్బతిన్న 29 ఎకరాలలోని మామిడి తోట, లింగాపూర్ గ్రామంలో నష్టపోయిన వరి పంటను బుధవారం నిర్మల్ కలెక్టర్ వరుణ్‌రెడ్డి పరిశీలించారు. పంట నష్టాన్ని అంచనా వేసి నివేదిక పంపాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. తదుపరి నిబంధనలకు లోబడి నష్టపరిహారం చెల్లిపునకు కృషి చేస్తామన్నారు.అనంతరం నచ్చన్‌ఎల్లాపూర్, లింగాపూర్ పల్లెప్రకృతి వనాలను, నర్సరీలను సందర్శించి పలు సూచనలు చేశారు. నచ్చన్‌ఎల్లాపూర్ సెరికల్చర్ షెడ్, పరిసర ప్రాంతాలను సందర్శించి అయిల్ ఫామ్ మొక్కలు నాటాలని, చుట్టూ పెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. లింగాపూర్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలించి వైద్య సిబ్బంది పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ శ్రీనివాస్, తహసీల్దార్ చిన్నయ్య, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, నచ్చన్‌ఎల్లాపూర్ సర్పంచ్ బొడ్డు గంగన్న, లింగాపూర్ సర్పంచ్ ఆకుల బాలవ్వ లచ్చన్న పాల్గొన్నారు.

కుక్కల దాడిలో బాలునికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. బుదవారం గ్రామానికి చెందిన రాథోడ్ అర్నవ్(7) అను బాలుడు ఆడుతుండగా కుక్కలు దాడి చేశాయి. దీంతో తీవ్ర గాయాలు కావటంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళ్లారు. గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి కుక్కల బెడదను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

పోలీసు సిబ్బందికి సీపీఆర్‌పై శిక్షణ

నవతెలంగాణ-ముథోల్

మండల కేంద్రమైన ముథోల్‌లోని పోలీసు స్టేషన్‌లో బుధవారం భైంసా డివిజనల్ ట్రైనింగ్ అధికారి డాక్టర్ ఆకాష్ గడపాలే ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందికి సీపీఆర్‌పై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ ఎలా చేయాలో చూపించారు. పోలిస్ సిబ్బందికి సూచనలు సలహాలను తెలియజేశారు. సకాలంలో సీపీఆర్ చేయడం వల్ల ప్రాణాలను రక్షించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముథోల్ సీఐ వినోద్ రెడ్డి, ట్రిపుల్ ఐటి ఎస్సై రోహిణి, ఎడ్ బిడ్ సిహెచ్ఓ నవ్యశ్రీ, ఏఎస్సై సుదర్శన బౌద్ధ పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో అన్నదానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని పెద్ద వాగు ఒడ్డున గల అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం ఆలయ అర్చకులు నగేష్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి వెంకట్‌గౌడ్, కోశాధికారి చంద్రమోహన్, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్, సభ్యులు బాబుగౌడ్, సీహెచ్ సంతోష్, ఆశిష్, బాలరాం, గుండా సతీష్, శ్యామ్, బట్టుపెల్లి సంతోష్, శ్రీధర్, దూడల అశోక్ పాల్గొన్నారు.

కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ముథోల్

తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటి వెలుగు కార్యక్రమంను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ రాంచందర్ అన్నారు. మండలంలోని ముద్గల్ గ్రామంలో బుధువారం కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంధత్వ నివారణ కొరకు ప్రతిష్టాత్మకంగా కంటి వెలుగు శిబిరాలను ఏర్పాటు చేస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు సమగ్ర కంటి పరీక్షలను చేసుకోవాలని అన్నారు. పరీక్షలు చేసుకున్న రోగులకు మందులతో పాటు ఉచితంగా కళ్ళ అద్దాలను సైతం అందింస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ అయేషా, ఎంపీటీసీ ఆత్మ స్వరూప్, ఉప సర్పంచ్ ప్రవీణ్, ఏఎన్ఎం స్పందన, ఆప్తమలజిస్ట్ చెరుకుల రాజ్యం పాల్గొన్నారు.

తెగిన గుండి వాగు తాత్కాలిక వంతెన

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని గుండి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో వాగుపై ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెన మంగళవారం కురిసిన వర్షానికి తెగిపోయింది. దీంతో గ్రామానికి వెళ్లే గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నాయకులు పదేపదే బ్రిడ్జి నిర్మిస్తామని చెప్పినప్పటికీ పూర్తిస్థాయిలో బ్రిడ్జి అందుబాటులోకి రాకపోవడంతో గ్రామస్తుల కష్టాలు తొలగిపోవడం లేదు. ప్రస్తుతం పనులు ప్రారంభమైనప్పటికీ అనుకున్న స్థాయిలో వేగంగా పనులు చేపట్టక పోవటంతో రానున్న వర్షాకాలంలో కూడా వంతెన అందుబాటులోకి రాదని ఆవేధన వ్యక్తం చేస్తున్నారు.

నిరుద్యోగులతో ప్రభుత్వ చెలగాటం

నవతెలంగాణ-జన్నారం

నిరుద్యోగుల జీవితాలతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని కాంగ్రెస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు బోర్లకుంట ప్రభుదాస్, పసియుల్లా అన్నారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రం కలెక్టరేట్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు నిరుద్యోగ ర్యాలీలో పాల్గొనడానికి జన్నారం మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నిరుద్యోగ ర్యాలీకి తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పాల్గొననున్నట్లు వారు తెలిపారు. నిరుద్యోగుల పట్ల ప్రభుత్వం సవతి తల్లిని ప్రేమను ప్రదర్శిస్తుందన్నారు. నిరుద్యోగ భృతి రూ.3000 ఇస్తానని ఇప్పటివరకు ఇవ్వకపోవడం, దారుణమన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షులు సోహెల్‌షా, నాయకులు ముత్యం రాజన్న మామిడిపల్లి ఇందయ్యా, దుమల రమేష్, గంగన్న, రోహిత్ పాల్గొన్నారు.

కేంద్ర గ్రంథాలయానికి సౌకర్యాలు కల్పించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని కేంద్ర గ్రంథాలయంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని బీసీ యువజన సంఘం నాయకుడు అవిడపు ప్రణయ్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన జిల్లా కేంద్రంలోని గ్రంథాలయాన్ని సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గ్రంథాలయంలో కేవలం రెండు గదులు మాత్రమే ఉన్నాయని, సదుపాయాలు లేక పోవడంతో పాఠకులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే రెగ్యులర్ కార్యదర్శిని, ఇద్దరు వాచ్ మన్‌ని నియమించాలని, గ్రంథాలయానికి పక్కా భవన నిర్మాణ పనులు త్వరితతిన పూర్తి చెయ్యాలని కోరారు. అన్ని రకాల మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సైదం నాగరాజు, గడ్డల ప్రణయ్, పిప్రె సాయి, బొట్టుపల్లి ప్రశాంత్, గడ్డల కరణ్, రాజ శేఖర్, మెంగ్రే ఆకాష్ పాల్గొన్నారు.